సాక్షి
పశ్చిమగోదావరి
సోమవారం । 8 । సెప్టెంబర్ । 2025



బ్రిటన్ మంత్రి కావడమే లక్ష్యం

బ్రిటన్ మంత్రి కావడమే తన లక్ష్యమని లండన్‌లోని రాయల్ బరో ఆఫ్ కెన్సింగ్టన్ అండ్ చెల్సియా డిప్యూటీ మేయర్ ఆర్యన్ ఉదయ్ ఆరేటి చెప్పారు. 8లో



పరిహారం లేదు.. పథకమూ అందదు

రాష్ట్రం కోసం, పోలవరం ప్రాజెక్టు కోసం సర్వం త్యాగం చేసిన విలీన మండలాల రైతులపై కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. 8లో



జీడిమామిడి కనుమరుగు

సరైన ప్రోత్సాహం లేక ఏజెన్సీ ప్రాంతంలోని జీడిమామిడి పంటల స్థానంలో ప్రత్యామ్నాయ సాగు వైపు రైతులు దృష్టి సారిస్తూ తోటలు తొలగిస్తున్నారు. 8లో

సచివాలయ ఉద్యోగుల పోరు బాట

ఆత్మగౌరవ ఉద్యమం

- సర్వేల భారంతో సతమతం
- ఒత్తిళ్లతో విధుల నిర్వహణ
- మహిళా, దివ్యాంగ సిబ్బందికి తప్పని ఇబ్బందులు
- ప్రభుత్వ వైఖరిపై మండిపాటు
- జిల్లాలో 4,331 మంది ఉద్యోగుల నిరసన గళం



ఐరగవరం ఎంపీడీఓ కార్యాలయం వద్ద నిరసన తెలిపి వినతిపత్రం ఇస్తున్న సచివాలయ ఉద్యోగులు (ఫైల్)

భీమవరం(ప్రకాశం చౌక్): కూటమి ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిరసనగా గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల ఆత్మగౌరవ ఉద్యమ బాట పట్టారు. పని ఒత్తిళ్లు, సర్వేల భారం, తమ ఆత్మగౌరవాన్ని దిగజార్చడంపై ఇప్పటికే పలుమార్లు వినతిపత్రాలు సమర్పించినా ప్రభుత్వం స్పందించకపోవడంతో ఏడు రోజులపాటు నిరసనలకు పిలుపునిచ్చారు. గ్రామ స్వరాజ్యమే లక్ష్యంగా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గ్రామ, వార్డు సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థలను తీసుకువచ్చింది. గత ప్రభుత్వంలో ఐదేళ్లపాటు పూర్తిస్థాయిలో ఈ వ్యవస్థల ద్వారా ముంగిళ్లలోకే ప్రజలకు పాలనను చేరువ చేశారు. అయితే కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు వలంటీర్ వ్యవస్థను కొనసాగిస్తామని హామీ ఇచ్చి గద్దెనెక్కిన తర్వాత నిర్దాక్షిణ్యంగా వలంటీర్ వ్యవస్థను రద్దు చేసింది. దీంతో రాష్ట్రంలో లక్షలాది మంది వలంటీర్లు ఉపాధి కోల్పోయారు. ఈ క్రమంలో సచివాలయ ఉద్యోగులపై పనిభారం మరింత పెరిగింది. ఇంటింటా సర్వేలు, పింఛన్ల పంపిణీ, మల్టీ టాస్కింగ్ విధులతో సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. రోజురోజుకూ ఉద్యోగుల ఆత్మగౌరవాన్ని దిగజార్చేలా ప్రభుత్వం వ్యవహరించడంపై రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు ఆత్మగౌరవ ఉద్యమం పేరట నిరసనలు తెలుపుతున్నారు. దీనిలో భాగంగా జిల్లాలోని 380 గ్రామ, 155 వార్డు సచివాలయ ఉద్యోగులు మొత్తం 4,331 మంది నిరసనలు తెలుపుతున్నారు. తమ సమస్యలు పరిష్కరించాలని గళమెత్తుతున్నారు.



ఆర్డీఓ దాసి రాజుకు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం (ఫైల్)

ఉద్యమ కార్యాచరణ

సచివాలయ ఉద్యోగులు ఏడు రోజుల పాటు నిరసన కార్యక్రమాలకు పిలుపునిచ్చారు. దీనిలో భాగంగా తొలిరోజు (శనివారం) ఉన్నతాధికారులకు వినతిపత్రాలు సమర్పించారు. 2, 3 రోజుల్లో (సోమ, మంగళవారాలు) నల్ల బ్యాడ్జీలతో విధులకు హాజరు, 4, 5 రోజుల్లో (బుధ, గురువారాలు) అధికారిక వాట్సాప్ గ్రూపుల నుంచి వైదొలగడం, 6,7 రోజుల్లో (శుక్ర, శనివారాలు) పెన్‌డౌన్ కార్యక్రమాల ద్వారా నిరసన తెలుపనున్నారు.

జిల్లాలో ఇలా..

గ్రామ సచివాలయాలు	380
గ్రామ సచివాలయ ఉద్యోగులు	3,318
వార్డు సచివాలయాలు	155
వార్డు సచివాలయ ఉద్యోగులు	1,013

సమస్యల వెల్లువ

- వలంటీర్ల వ్యవస్థను రద్దు చేయడంతో ఒక్కో ఉద్యోగి మూడు నుంచి ఐదు క్లస్టర్ల పరిధిలో సేవలందించాల్సి వస్తోంది. ఈ లెక్కన ఒక్కో ఉద్యోగి 150 నుంచి 250 కుటుంబాల బాధ్యతలను నిర్వహించడం కష్టంగా మారింది.
- సామాజిక, ఆర్థిక, విద్య, వైద్య, ఉపాధి తదితర సర్వేల భారాన్ని ప్రభుత్వం మోపడాన్ని వీరంతా వ్యతిరేకిస్తున్నారు.
- మల్టీటాస్కింగ్ పేరుతో మాతృశాఖ పనులతో పాటు ఇతర శాఖల పనులు కూడా చేయమని బలవంతం చేస్తున్నారు. డాష్ బోర్డులు, టార్గెట్ల పేరిటపై అధికారులు వేధిస్తున్నారు.
- సర్వేలకు వెళ్లినప్పుడు మహిళా సిబ్బంది సామాజిక వేధింపులకు గురవుతున్నారు. రక్షణపై ఆందోళన చెందుతున్నారు.
- సర్వే కోసం ఇంటింటా తిరగడం దివ్యాంగ సిబ్బందికి ఇబ్బందిగా ఉంది.
- సర్వే సమయంలో ఆధార్, బయోమెట్రిక్, ఓటీపీలు చెప్పేందుకు కొందరు సహకరించడం లేదు.
- సంక్షేమం, ఉద్యోగ ప్రయోజనాలు వంటి విషయాల్లో అధికారులు శ్రద్ధ చూపడం లేదు. సర్వేల విషయంలో ఒత్తిడి పెంచడం, సర్వే కాలేదనే కారణంతో సస్పెండ్ చేయడం ఉద్యోగులను ఆందోళన కలిగిస్తోంది.
- పని ఒత్తిళ్లతో కుటుంబ జీవనానికి దూరమవుతున్నామని ఉద్యోగులు వాపోతున్నారు. కొందరు ఆత్మహత్యలకు సైతం పాల్పడ్డారు.

ప్రధాన డిమాండ్లు

- ఒకే మాతృ శాఖ కింద ఆత్మగౌరవంతో పనిచేయడానికి ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలి.
- అన్ని సర్వేలను సంబంధిత శాఖల ద్వారానే నిర్వహించి సచివాలయ సిబ్బందిపై భారం తొలగించాలి.
- పదోన్నతుల్లో జాప్యాన్ని నివారించి, జిల్లాల వారీగా, యూఎల్‌బీ వారీగా సీనియార్టీ లిస్టులు ప్రకటించి, ప్రక్రియను 2 నుంచి 3 నెలల్లో పూర్తి చేయాలి.
- ప్రతి యూఎల్‌బీ ఖాళీల్లో కనీసం 50 శాతం ఖాళీలను సచివాలయ సిబ్బందితో భర్తీ చేయాలి.
- 5 నుంచి 6 ఏళ్ల సర్వీస్ పూర్తిచేసిన ఉద్యోగులకు ఆటోమేటిక్ అడ్వాన్స్‌డ్ స్కీమ్ వర్తింపజేసి, రెండు అదనపు ఇంక్రిమెంట్లు ఇవ్వాలి.
- ప్రొబేషన్ పీరియడ్‌లో రావాల్సిన నోషనల్ ఇంక్రిమెంట్లకు స్పష్టమైన టైమ్ ఫ్రేమ్ నిర్ణయించాలి.

అధిక పని భారం



కూటమి ప్రభుత్వం వలంటీర్ వ్యవస్థను రద్దు చేసి సచివాలయ ఉద్యోగులపై భారం వేసింది. గతంలో ఒక వలంటీర్ క్లస్టర్ (50 ఇళ్లు) చూసుకుంటే సచివాలయ ఉద్యోగికి ప్రస్తుతం మూడు నుంచి ఐదు క్లస్టర్ల బాధ్యతలు అప్పగించారు. దీంతో తీవ్ర పని ఒత్తిళ్లతో విధులు నిర్వహించాల్సి వస్తోంది. శాఖాపరమైన పనులతో పాటు బీఎల్‌ఓ, అదనపు పనులు, సర్వేల భారాన్ని మోపారు. సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేదు. ఇప్పటికైనా మా సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా ఆత్మ గౌరవ ఉద్యమం చేపట్టాం.

– ఎ.శ్రీనివాస్, ఏపీ ఎంఎంఈఏ రాష్ట్ర ప్రచార కార్యదర్శి, వార్డు సెక్రటరీ, భీమవరం

సమస్యలు పరిష్కరించాలి



క్లస్టర్ మ్యాపింగ్ సిస్టమ్ సచివాలయ సిబ్బందికి గుదిబండ వంటిది. గతంలో వలంటీర్లు ఉండటంతో సర్వేలు, పెన్షన్ల పంపిణీ సులభంగా జరిగేది. వలంటీర్లు లేకపోవడంతో సచివాలయ ఉద్యోగులపై భారం పెరిగింది. ఉదయం 8 గంటలలోపు, సాయంత్రం 5 గంటల తర్వాత కూడా సేవలందించాల్సి వస్తుంది. ఒక్కో ఉద్యోగి మూడు నుంచి ఐదు క్లస్టర్ల బాధ్యతలు చూసుకోవడం చాలా భారంగా ఉంది. ఒక్కో ఉద్యోగి 150 నుంచి 250 కుటుంబాల బాధ్యతలు నిర్వహించడం కష్టంగా ఉంది. ప్రభుత్వం కొన్ని సర్వేలను థర్డ్ పార్టీ వారితో చేయించాలి. సచి వాలయ ఉద్యోగుల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలి.

–కె.శ్రీనివాస్, రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్, ఏపీ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంక్షేమ సంస్థ

న్యూస్‌రీల్

విద్యారంగంపై ప్రభుత్వ నిర్లక్ష్యం



యూటీఎఫ్ రణభేరి పోస్టర్లు ఆవిష్కరిస్తున్న దృశ్యం

భీమవరం: ప్రపంచ బ్యాంకు ఆదేశాలతో ప్రభుత్వాలు విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తున్నాయని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక అంబేడ్కర్ భవనంలో ఆదివారం యూటీఎఫ్ జిల్లా మధ్యంతర కౌన్సిల్ సమావేశాలను ఆదివారం నిర్వహించారు. విద్యారంగ, ఆర్థిక సమస్యలపై ఈనెల 15 నుంచి 19 వరకు రాష్ట్రంలోని ఐదు ప్రాంతాల్లో నిర్వహించనున్న రణభేరి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఉభయగోదావరి జిల్లాల టీచర్ ఎమ్మెల్సీ బొర్రా గోపి మూర్తి మాట్లాడుతూ ఉపాధ్యాయులు స్వేచ్ఛగా తరగతి గదిలో పాఠాలు బోధించే అవకాశాన్ని కల్పించాలన్నారు. అనంతరం రణభేరి వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. మారెళ్ల మార్కండేయులు, పీఎస్ విజయ రామరాజు, చెల్లుబోయిన పట్టాభిరామయ్య, ఏకేవీ రామభద్రం తదితరులు పాల్గొన్నారు.

యూరియా వినియోగంపై అవగాహన



కోపల్లె సొసైటీలో ఎరువులను పరిశీలిస్తున్న కలెక్టర్ నాగరాణి

కాళ్ల : రైతులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా యూరియాను అందిస్తున్నామని, సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ సీహెచ్ నాగరాణి తెలిపారు. ఆదివారం కోపల్లె సొసైటీలో యూరియా వినియోగంపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. అధికారుల సూచన మేరకే యూరియా వినియోగించాలన్నారు. జిల్లా వ్యవసాయ అధికారి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ యూరియా అధికంగా వాడడం వల్ల పంటకు ఎలాంటి ప్రయోజనం ఉండదన్నారు. చైర్మన్ నంద్యాల రామరాజు, జిల్లా సహకార అధికారి ఎస్.మురళీకృష్ణ, ఏడీఏ కె.జీ వనప్రతాప్ ఉన్నారు.

పంటు రాకపోకల పునరుద్ధరణ

నరసాపురం: నరసాపురంలోని సఖినేటిపల్లి రేవులో ఆదివారం నుంచి పంటు రాకపోకలు పునరుద్ధరించారు. గోదావరి వరద కారణంగా 15 రోజుల నుంచి పంటు రాకపోకలు నిలుపుదల చేశారు. గోదావరి నీటిమట్టం కాస్త తగ్గడంతో పంటును పునరుద్ధరించారు. దీంతో నరసాపురం, సఖినేటిపల్లి మధ్య ప్రయాణికుల రాకపోకలకు ఇబ్బందులు తొలగాయి.

నేడు పీజీఆర్ఎస్

భీమవరం (ప్రకాశంచౌక్): ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రారంభించిన మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోవాలని కలెక్టర్ సీహెచ్ నాగరాణి తెలిపారు. అర్జీలు పరిష్కారం కాకపోయినా లేదా తమ ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్‌కు కాల్ చేయవచ్చన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో అర్జీలు స్వీకరిస్తామన్నారు.

మెరుగైన వైద్య సేవలందించాలి

భీమవరం(ప్రకాశం చౌక్): ప్రభుత్వాస్పత్రుల్లో మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ సీహెచ్ నాగరాణి ఆదేశించారు. ఆదివారం భీమవరం ప్రభుత్వాస్పత్రిని ఆమె సందర్శించి వార్డులను పరిశీలించి సేవలపై రోగులను ఆరా తీశారు. రోగులతో మర్యాదగా వ్యవహరించాలని వైద్యులకు సూచించారు. ప్రభుత్వాస్పత్రుల సేవల్లో జిల్లా ప్రథమ స్థానంలో నిలిచిందని, ఇదే స్ఫూర్తితో పనిచేయాలన్నారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ లక్ష్మణ్ గీతానంద్, ఆర్ఎంఓ కె.ప్రవీణ్‌కుమార్, డాక్టర్ సుబ్బలక్ష్మి, డాక్టర్ పద్మ ఉన్నారు.

శాంతించిన తమ్మిలేరు

చింతలపూడి: తమ్మిలేరు జలాశయానికి వరద తగ్గుముఖం పట్టింది. ప్రాజెక్టులో ప్రస్తుతం 346.7 అడుగుల నీరు ఉన్నట్టు ఇరిగేషన్ ఏఈ లాజరుబాబు తెలిపారు. ఈనెల 13న అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని, ప్రాజెక్టు నీటిమట్టం గరిష్ట స్థాయికి పెరగవచ్చని అన్నారు. తమ్మిలేరు ప్రాజెక్టు కింద పశ్చిమ, కృష్ణా జిల్లాల్లో 9,200 ఎకరాలు అధికారికంగా, అనధికారికంగా తమ్మిలేరు ప్రధాన కాల్వకు ఇరుపక్కలా మరో 15 వేల ఎకరాలకుపైగా రైతులు సాగు చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిగా నిండటంతో పంటలకు ఇబ్బంది ఉండదని భావిస్తున్నారు. కాగా ప్రాజెక్టులో 350 అడుగుల వరకు నీటిని నిల్వ చేసుకోవచ్చని అధికారులు చెప్పారు.

చంద్ర గ్రహణం.. ఆలయాల మూసివేత



ద్వారకాతిరుమల శ్రీవారి ఆలయ ప్రధాన ద్వారాలను మూసివేస్తున్న దృశ్యం



భీమవరంలో మావుళ్లమ్మ ఆలయం వద్ద..

సంపూర్ణ చంద్రగ్రహణం కారణంగా ఆలయాల తలుపులకు మూతలు పడ్డాయి. ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయం, భీమవరం మావుళ్లమ్మవారు, భీమవరం పంచారామక్షేత్రం, జంగారెడ్డిగూడెం మండలం గుర్వాయిగూడెంలో మద్ది అంజనేయ తదితర ఆలయాలను ఆదివారం మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో మూసివేశారు. ప్రధాన ద్వారాలు, గోపుర ద్వారాలను మూసివేసి తాళాలు వేశారు. సోమవారం ఉదయం శుద్ధి, సంప్రోక్షణ, పుణ్యాహవచనం అనంతరం భక్తులను అనుమతిస్తారు.

– ద్వారకాతిరుమల/భీమవరం (ప్రకాశం చౌక్)/జంగారెడ్డిగూడెం



గుర్వాయిగూడెంలో మద్ది అంజనేయస్వామి వారి ఆలయం వద్ద..



భీమవరంలో సోమేశ్వరస్వామి ఆలయ గోపుర ద్వారం మూసివేసిన దృశ్యం

రైతులను అప్పలపాలు చేసిన ప్రభుత్వం

- యూరియా కూడా అందించలేక చతికిలపడ్డ దుస్థితి
- మహిళా రైతులు సైతం క్యూలో ఉన్నా చోద్యం చూస్తున్న వైనం
- తణుకులో ఎమ్మెల్యే ఆరిమిల్లి అవినీతి రూ.1,200 కోట్లు
- విలేకరుల సమావేశంలో మాజీ మంత్రి కారుమూరి విమర్శలు



తణుకులో అన్నదాత పోరు కార్యక్రమ పోస్టర్‌ను ఆవిష్కరించిన మాజీ మంత్రి కారుమూరి, పార్టీ శ్రేణులు

తణుకు అర్బన్: కూటమి ప్రభుత్వం ఏర్పడిన రోజు నుంచి వ్యవసాయ రంగం అధోగతిపాలై రైతులు అప్పులపాలైపోయారని మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు మండిపడ్డారు. వైఎస్సార్, జగన్‌ల హయాంలో వ్యవసాయాన్ని పండుగ చేసి చూపించారని, వ్యవసాయం దండగన్న చంద్రబాబు ఆ వ్యాఖ్యలను కొనసాగిస్తూ రైతుల ఉసురు తీస్తున్నారని విమర్శించారు. తణుకు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులు తమ పంటలకు మంచి దిగుబడి రావాలనే ఉద్దేశంతో యూరియా కోసం పాకులాడుతున్నారని, క్యూ లైన్‌లలో మహిళలు కూడా నిల్చోవాల్సి వస్తుంటే చంద్రబాబు వెటకారంగా యూరియా వేస్తే క్యాన్సర్ వస్తుందని, పురుగు మందుల వాడకం తగ్గించాలని అనడం బాధాకరమన్నారు. ఏడాది పొడవునా వరి పంట పండుతూ ఉండే అన్నపూర్ణ లాంటి ఆంధ్రప్రదేశ్‌ను ఎడారిగా మార్చి రైతులను కన్నీళ్లు పెట్టిస్తున్నాడని దుయ్యబట్టారు. పెట్టుబడి సాయం లేక, ఇన్‌పుట్ సబ్సిడీ, పంటల బీమా వంటివి అమలు చేయకపోవడంతో రైతులు పంట పండించేందుకు అప్పులపాలవ్వాల్సి వస్తోందని చెప్పారు. రైతులను పట్టించుకోని కూటమి ప్రభుత్వం అమరావతికి కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తూ భ్రమరావతిని తయారు చేస్తోందని ఎద్దేవా చేశారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపుమేరకు ఈనెల 9న తాడేపల్లిగూడెం ఆర్డీఓ కార్యాలయం వద్దకు ర్యాలీగా తరలివెళ్లి వినతిపత్రాన్ని ఇవ్వనున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వంలో ఎరువుల బ్లాక్ మార్కెట్‌పై 'అన్నదాత పోరు' పోస్టర్‌ను కారుమూరితో పాటు పార్టీ శ్రేణులు ఆవిష్కరించారు.

తణుకు ఎమ్మెల్యే అవినీతి రూ.1,200 కోట్లు

కూటమి ప్రభుత్వం ఏర్పడిన రోజు నుంచి తణుకులో గతంలో ఎన్నడూ లేనివిధంగా ఆర్‌కే ట్యాక్స్ గొడవ మార్కెట్‌లో తీవ్ర చర్చనీయాంశమైందని మాజీ మంత్రి కారుమూరి విమర్శించారు. టీడీఆర్ బాండ్లు, మట్టి, పేకాటలు, క్రికెట్ బుకింగ్‌లు, మద్యం దుకాణాలు, పంచాయతీల్లో కమీషన్‌లతో పాటు ఆవులు, గేదెల కోతకు సంబంధించి ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ మొత్తం రూ.1,200 కోట్లు దోపిడీ చేశారని ఆధారాలు సైతం బయటకు వచ్చాయని స్పష్టం చేశారు. ఆ పార్టీ వారి వద్ద కూడా ఆధారాలు ఉన్నాయని వారే చెబుతున్నారని విమర్శించారు. నియోజకవర్గంలో ఏ పనికి వెళ్లినా ఎమ్మెల్యే ట్యాక్స్ వేస్తున్నారని ప్రజలు, టీడీపీ వర్గాలవారే చెబుతున్నారని అన్నారు. తణుకు ప్రాంతంలో గతంలో ఎన్నడూ ఇటువంటి ట్యాక్స్‌లు ఏ ప్రభుత్వంలో కూడా తాము ఎప్పుడూ చూడలేదని టీడీపీ వర్గీయులే చెబుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు మారిశెట్టి శేషగిరి, ఎంపీపీ రుద్రా ధనరాజు, వైఎస్సార్‌సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు సత్తి వెంకటరెడ్డి, పబ్లిసిటీ వింగ్ జిల్లా అధ్యక్షుడు జల్లూరి జగదీష్, నియోజకవర్గ మహిళాధ్యక్షురాలు మెహర్ అన్సారీ, తణుకు మండల అధ్యక్షుడు పెనుమర్తి వెంకటరామన్న, పట్టణ మహిళాధ్యక్షురాలు నూకల కనకదుర్గ, తణుకు మండల మహిళాధ్యక్షురాలు ఉండవల్లి జానకి, డాక్టర్ దాట్ల సుందరరామరాజు, తేతలి మాజీ సర్పంచ్ కోట నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కూటమి పాలనలో ఎరువుల కృత్రిమ కొరత

మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ



తాడేపల్లిగూడెంలో అన్నదాత పోరు పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం అర్బన్: కూటమి ప్రభుత్వం ఎరువులు కృత్రిమ కొరత సృష్టించి రైతులను ఆర్థికంగా దోచుకుంటోందని మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశాన్ని వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కొలుకులూరి ధర్మరాజు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి కొట్టు మాట్లాడుతూ వ్యవసాయానికి అవసరమైన నీటి కాలువలు నిర్వహణ చేయడం లేదని, గుర్రపుడెక్కను నియంత్రించడంలో అధికారులు విఫలమయ్యారన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 16 నెలలు గడుస్తున్నా రైతులకు న్యాయం చేయలేపోయిందని ఎద్దేవా చేశారు. ఏడాదికి రూ.20 వేలు ఇస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం ఇప్పటికీ రూ.5 వేలు మాత్రమే ఇచ్చిందన్నారు. ఇటీవల ఎరువుల కొరత సృష్టించి వాటాలు, కోటాల పేరుతో యూరియా బస్తాలను అధిక ధరలకు విక్రయిస్తున్నారని ఆరోపించారు. ఎరువుల సరఫరాలో తాడేపల్లిగూడెం కేంద్రంగా ఇతర ప్రాంతాలకు తరలిస్తారన్నారు. మార్క్‌ఫెడ్, మార్కెట్ వాటాలు ఎంతో తెలియజేయాలన్నారు. ఎరువులు ఎవరికి కోటా ఇచ్చారో ఇన్వాయిస్‌లను వెల్లడించాలని డిమాండ్ చేశారు. రైతుల ఇబ్బందులు సీఎం చంద్రబాబు, వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడికి కనిపించడం లేదా అని ప్రశ్నించారు. రైతులను చులకన చేసి మాట్లాడటం తగదన్నారు. పడమర విప్పర్రులో ఎరువులు జనసేన, టీడీపీ వర్గీయులైన రైతులకు మాత్రమే ఇచ్చారని, కూటమి అనుయాయులకే ప్రాధాన్యమిచ్చి మిగిలిన వారిపై నిర్లక్ష్యం తగదన్నారు. తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో షాడో ఎమ్మెల్యే ఎవరో తెలియజేయాలన్నారు. నియోజకవర్గంలో రైతుల కష్టాలు ప్రజాప్రతినిధులకు కానరావడం లేదన్నారు.

9న అన్నదాత పోరు

రైతుల విషయంలో కూటమి ప్రభుత్వం చేస్తున్న అక్రమాలు, అవినీతికి వ్యతిరేకంగా ఈనెల 9న వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో అన్నదాత పోరు కార్యక్రమాన్ని ఆర్డీఓ కార్యాలయాల వద్ద నిర్వహించనున్నామని మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ తెలిపారు. రైతులు, పార్టీ శ్రేణులు, అభిమానులు తరలిరావాలని పిలుపునిచ్చారు. అనంతరం అన్నదాత పోరు పోస్టర్లను ఆవిష్కరించారు. నాయకులు ముప్పిడి సంపత్‌కుమార్, ఆరేపల్లి సుబ్బారావు, కర్రి భాస్కరరావు, వెలిశెట్టి నరేంద్ర కుమార్, చెన్నా జనార్దన్, గార్లపాటి వీరకుమార్, సిర్రావు శాంతకుమార్, మహ్మద్ రఫీ తదితరులు పాల్గొన్నారు.

కూటమి పాలనలో రౌడీ సంస్కృతి

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు డీఎన్నార్ ధ్వజం
- దానిగూడెం దళితవాడలో బాధిత కుటుంబాలకు పరామర్శ



దానిగూడెంలో గాయపడిన దినేష్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న డీఎన్నార్

కైకలూరు: కైకలూరు నియోజకవర్గంలో ఎన్నడూ చూడని కత్తులు, కర్రలతో దాడులు చేసే సంస్కృతి కూటమి పాలనలోనే కనిపిస్తోందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) విమర్శించారు. వినాయక ఊరేగింపు సందర్భంగా జనసేన కార్యకర్తల దాడిలో తీవ్రంగా గాయపడిన దానిగూడెం దళితవాడ బాధిత కుటుంబాలను ఆదివారం ఆయన పరామర్శించి చర్చిలో మాట్లాడారు. ఈ సందర్భంగా దళితులు మాట్లాడుతూ వినాయక ఊరేగింపులో డీజే సౌండ్ల వద్ద హారన్ కొట్టినందుకు జనసేన కార్యకర్తలు విచక్షణారహితంగా పయ్యేద్దు అజయ్, గొంతుపులి దినేష్‌బాబుపై బ్లేడు, కత్తులు, రాడ్లతో దాడి చేశారన్నారు. దీనిపై దళితులు ఆందోళన చేస్తే పోలీసులు తమపైనే లాఠీ చార్జీ చేశారని, తగిలిన దెబ్బలను డీఎన్నార్‌కు చూపించారు. గొడవలకు ప్రధాన సూత్రధారి, జనసేన నేత కొల్లి బాబీని కేసు నుంచి తప్పించడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. తీవ్ర గాయాలైన అజయ్, దినేష్‌బాబు తండ్రులు శ్రీను, నానీలు కన్నీళ్లు పెట్టుకుని తమకు న్యాయం చేయాలని కోరారు. డీఎన్నార్ మాట్లాడుతూ కూటమి పాలనలో రౌడీలమంటూ అరాచక శక్తులు చెలరేగిపోతున్నాయన్నారు. పోలీసులు వారం ముందు అన్నసమారాధనలో జరిగిన ఘర్షణపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకుంటే ఇటువంటి హత్యాయత్నాలు జరిగేవి కావన్నారు. కేసు విషయమై ఏలూరు ఎస్పీతో మాట్లాడానన్నారు. నిందితులకు శిక్ష పడేవరకూ పార్టీ పరంగా దళితులకు అండగా ఉంటామన్నారు. రోడ్డుపై చేసిన ఆందోళనపై దానిగూడెం దళితులపై కేసు నమోదు చేసినట్టు తెలిసిందని, తక్షణమే ఈ కేసును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. దోషులను కఠినంగా శిక్షించకపోతే పార్టీపరంగా ఆందోళన చేస్తామని హెచ్చరించారు. స్థానిక ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ పక్కన కూర్చుని రౌడీయిజం చేస్తున్న సంఘ విద్రోహులను పక్కన పెట్టి ప్రశాంత వాతావరణం కల్పించాలని డీఎన్నార్ కోరారు.

క్లుప్తంగా

అక్రమంగా తరలిస్తున్న పొగాకు సీజ్



అక్రమంగా తరలిస్తున్న పొగాకు బేళ్లను సీజ్ చేసి వేలం కేంద్రానికి తరలించిన దృశ్యం

జంగారెడ్డిగూడెం: పొగాకు బోర్డు విజిలెన్స్ అధికారులు ఆదివారం జంగారెడ్డిగూడెం పొగాకు వేలం కేంద్రాల పరిధిలో దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా విజిలెన్స్ అధికారి సునీల్‌కుమార్ మాట్లాడుతూ తమకు అందిన సమాచారం మేరకు వేగవరం సమీపంలో తనిఖీలు చేపట్టామన్నారు. లేలాండ్ దోస్త్ వాహనంలో 12 ఎఫ్‌సీవీ పొగాకు బేళ్లను అక్రమంగా తరలించడాన్ని గుర్తించి, బేళ్ల వాహనాన్ని సీజ్ చేసి, జంగారెడ్డిగూడెం పొగాకు వేలం కేంద్రానికి తరలించినట్లు చెప్పారు. దాడుల్లో సాయి ప్రశాంత్, గణేష్, బోర్డు సిబ్బంది ఠాగూర్, వంశీ, హర్ష తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణం సీజ్



నెక్కలం గొల్లగూడెంలో ఎరువుల దుకాణం తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

ఆగిరిపల్లి: మండలంలోని నెక్కలం గొల్లగూడెంలో హనుమాన్ ఏజెన్సీస్ ఎరువుల దుకాణాన్ని విజిలెన్స్ అధికారులు సీజ్ చేశారు. పలు ఎరువులు దుకాణాలను విజిలెన్స్ డీఎస్పీ సింగులూరి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో తనిఖీలు చేశారు. నెక్కలం గొల్లగూడెంలోని హనుమాన్ ఏజెన్సీలో రూ.2.75 లక్షల విలువ కలిగిన 12.65 టన్నుల కాంప్లెక్స్, సూపర్ ఎరువుల నిల్వలలో వ్యత్యాసం ఉన్నట్లు గుర్తించడంతో ఆ షాపును సీజ్ చేసి యజమానిపై కేసు నమోదు చేశారు. అదే దుకాణానికి ఫారం ఓ లేనందున 3.85 టన్నుల ఎరువులు విక్రయాలను నిలిపివేశారు. తనిఖీల్లో విజిలెన్స్ ఇన్స్పెక్టర్ పి.శివరామకృష్ణ, విజిలెన్స్ ఏఓ జి.మీరయ్య, ఎస్సై రంజిత్ కుమార్, ఆగిరిపల్లి మండల వ్యవసాయ అధికారిణి జొన్నలగడ్డ భవాని పాల్గొన్నారు.

భార్యపై హత్యాయత్నం



భర్త దాడిలో గాయపడిన మర్రిపూడి సంగీత

తాడేపల్లిగూడెం అర్బన్: అనుమానంతో భార్యపై కత్తితో భర్త దాడి చేసిన సంఘటన పట్టణంలో చోటు చేసుకొంది. ఎస్సై బాదం శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక జువ్వలపాలెం ప్రాంతానికి చెందిన మర్రిపూడి లక్ష్మణరావు, సంగీతలకు 16 ఏళ్ల క్రితం వివాహమైంది. కొంతకాలం సంగీత దుబాయిలో పనిచేసింది. ఆదివారం జువ్వలపాలెంలోని చర్చికి భార్యభర్తలు ఇద్దరూ వెళ్లారు. ప్రార్ధన చేస్తున్న సంగీతపై భర్త లక్ష్మణరావు కత్తితో దాడి చేశాడు. సంగీతకు తల, శరీరంపై తీవ్ర గాయాలయ్యాయి. చర్చిలో ప్రార్ధనకు వచ్చిన కొందరు అతనిని అడ్డుకొని సంగీతను రక్షించి స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి వైద్యం నిమిత్తం తరలించారు. స్థానికులు సమాచారంతో ఎస్సై బాదం శ్రీనివాస్ బాధితురాలిని విచారించగా తనపై అనుమానంతో భర్త దాడి చేశాడని చెప్పింది. దీంతో హత్యాయత్నం కేసు నమోదు చేసి లక్ష్మణరావును అదుపులోకి తీసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బ్రిటన్ మంత్రి కావడమే లక్ష్యం

- యూకే స్టూడెంట్స్ ఎన్నికల్లో గెలుపే రాజకీయాల వైపు నడిపించింది
- రెండుసార్లు కౌన్సిలర్‌గా గెలుపొందా
- అందరితో కలుపుగోలుతనమే నా విజయ రహస్యం
- 'సాక్షి'తో లండన్‌లోని కెన్సింగ్టన్ అండ్ చెల్సియా డిప్యూటీ మేయర్ ఆర్యన్ ఉదయ్
- స్వస్థలం భీమవరంలో సహ విద్యార్థులతో మమేకం



భీమవరం సెయింట్ మేరీస్ స్కూల్‌లో విద్యార్థులతో సెల్ఫీ తీసుకుంటున్న కెన్సింగ్టన్ అండ్ చెల్సియా డిప్యూటీ మేయర్ ఆర్యన్ ఉదయ్



ఆర్యన్ ఉదయ్

సాక్షి, భీమవరం: బ్రిటన్ మంత్రి కావడమే తన లక్ష్యమని లండన్‌లోని రాయల్ బరో ఆఫ్ కెన్సింగ్టన్ అండ్ చెల్సియా డిప్యూటీ మేయర్ ఆర్యన్ ఉదయ్ ఆరేటి చెప్పారు. యూకే కాలేజీలో తెలుగు విద్యార్థుల పట్ల వివక్షకు వ్యతిరేకంగా పోరాడి స్టూడెంట్ ఎన్నికల్లో గెలవడమే తన రాజకీయ ప్రవేశానికి కారణమని తెలిపారు. అనంతరం కన్జర్వేటివ్ పార్టీలో చేరి రెండుసార్లు కౌన్సిలర్‌గా గెలిచినట్లు చెప్పారు. భీమవరం సమీపంలోని తుందుర్రు గ్రామానికి చెందిన ఆర్యన్ ఉదయ్ ఇటీవల భీమవరం వచ్చారు. ఈ సందర్భంగా ఆయన «సాక్షి»తో మాట్లాడారు. తన బాల్యం, చదువు, బ్రిటన్ రాజకీయాల్లో ఎదుగుదల, తన లక్ష్యాల గురించి వివరించారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

టెన్నిస్ కోసం లండన్‌కు

మాది భీమవరం పక్కనే ఉన్న తుందుర్రు. తాత నాయనమ్మల పేర్లు ఆరేటి వీరాస్వామి, గొబ్బిలమ్మ. తండ్రి వెంకటసత్యనారాయణ కేజీఆర్ ప్రిన్సిపల్‌గా పనిచేశారు. తల్లి విజయలక్ష్మి. సోదరి ఇంద్రాణి. 7వ తరగతి వరకు భీమవరంలోని సెయింట్ మేరీస్ స్కూల్‌లో చదువుకున్నా. అప్పటికే ఏపీ తరపున టెన్నిస్ ఆడుతున్న నేను ఆటపై ఆసక్తితో 8వ తరగతి హైదరాబాద్‌లో చేరాను. స్కూల్ నేషనల్స్, ఇంటర్ స్టేట్ కాంపిటీషన్స్‌కు ఏపీ కెప్టెన్‌గా వ్యవహరించాను. నా స్నేహితులు చాలామంది యూఎస్, యూకే వెళ్లేవారు. గ్రాడ్యుయేషన్ తరువాత టెన్నిస్ కోసం యూకే వెళ్లాను. 2006లో ఏయూ స్కాలర్‌షిప్ రావడంతో లండన్‌లో ఎంఎస్ చేశాను.

రాజకీయాల్లోకి..

యూకే కాలేజీలో తెలుగు విద్యార్థుల పట్ల వివక్ష పూరిత సంఘటనలకు వ్యతిరేకంగా పోరాడేవాడిని. అప్పుడే స్టూడెంట్స్ ఎన్నికల్లో గెలవడం నాలో ఆత్మస్థైర్యం, నమ్మకం పెంచాయి. చదువు అనంతరం అక్కడే ఉండి బిజినెస్ చేసుకుంటూ కన్జర్వేటివ్ పార్టీ ఫాలోవర్‌గా ఉన్నాను. అక్కడి సిటిజన్‌షిప్ కూడా వచ్చింది. బ్రెగ్జిట్ టైంలో ప్రధాని డేవిడ్ కేమరూన్ టీంలో చేరాను. నా అనాలసిస్, స్ట్రాటజీని చూసి కన్జర్వేటివ్ పార్టీ తరపున పనిచేయాలని ప్రోత్సహించేవారు. 2014లో పార్టీలో సభ్యుడిగా చేరాను. రెండు, మూడు సంవత్సరాలు పార్టీ విధివిధానాలు, రాజకీయ పరిస్థితులను సైలెంట్‌గా అబ్జర్వ్ చేస్తూ వచ్చాను. ఇక్కడి మాదిరి అక్కడ కూడా రాజకీయ పార్టీల్లో అంతర్గత విభేదాలు, వివక్ష కామన్.

సెంట్రల్ కౌన్సిలర్‌గా ఎన్నిక

నిజాం కాలేజీలో ఇంటర్ చదువుతున్న రోజుల్లో ఆర్ఎస్ఎస్‌కు ఆకర్షితుడినయ్యాను. లండన్‌లోను దేవాలయాలకు వెళ్లి దీపారాధన చేసేవాడిని. భారతీయులను, మన సంప్రదాయాలను ఎంతో గౌరవించే పార్టీ చైర్మన్, మాజీ మేయర్ జూలీమీల్స్ నన్ను ఎంతో ప్రోత్సహించేవారు. అందరితో కలుపుగోలుతనం నాకు కలిసొచ్చింది. ఇంటర్నల్ ఓటింగ్‌లో తెల్లవాళ్ల కంటే అత్యధిక మెజార్టీ సాధించడంతో 2017లో నాకు సీట్ డిక్లేర్ అయ్యింది. 2018లో జరిగిన ఎన్నికల్లో మొదటిసారి సెంట్రల్ కౌన్సిలర్‌గా గెలిచాను. కౌన్సిలర్ అంటే ఇక్కడ ఎమ్మెల్యేతో సమానం. 2022 ఎన్నికల్లోను వరుస విజయాన్ని అందుకున్నాను. లండన్‌లోని ముఖ్యమైన ప్రాంతానికి డిప్యూటీ మేయర్‌గా సుమారు రెండున్నర లక్షలమందికి ప్రాతినిధ్యం వహిస్తున్నాను. ప్లానింగ్, లైసెన్సింగ్, ఎన్విరాన్‌మెంట్ తదితర కీలక కమిటీల్లో సభ్యుడిగా ఉన్నాను. మేయర్ అందుబాటులో లేని సమయంలో ఆ బాధ్యతలు నిర్వర్తించాల్సి ఉంటుంది. భారత్, బ్రిటన్ ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంట్‌లో ఆక్వా, ఎన్విరాన్‌మెంట్‌కు సంబంధించి కొన్ని పాలసీలు చేయాలని అనుకున్నాం. కానీ సెంట్రల్ స్థాయిలో మా పార్టీ ఓడిపోవడంతో అది సాధ్యం కాలేదు. భవిష్యత్తులో ఆ దిశగా కృషిచేస్తాను. దేవుడి దయతో ఈ స్థాయికి వచ్చాను. వచ్చే ఎన్నికల్లో మేయర్ కావాలన్నదే నా లక్ష్యం. ఎంపీ కావడం, అనంతరం మినిస్టర్ అవడం తదుపరి లక్ష్యాలు.

ఎవరినీ తక్కువ అంచనా వేయకూడదు

యువత కులమతాలు, ప్రాంతీయ విభేదాలు విడిచిపెట్టి అందరితో కలిసుండాలి. అనవసరమైన ఆర్భాటాలు, పబ్లిసిటీలకు దూరంగా ఉండాలి. ఎవరినీ తక్కువ అంచనా వేయకుండా లక్ష్యాన్ని చేరేందుకు ముందుకు సాగాలి

జీడిమామిడి కనుమరుగు



బుట్టాయగూడెం మండలంలో జీడితోటలను నరికేసిన దృశ్యం



నరికేసిన జీడిమామిడి చెట్లను ట్రాక్టర్లపై తరలిస్తున్న దృశ్యం

- సరైన ప్రోత్సాహం లేక తోటలు నరికివేత
- ఏజెన్సీ మండలాల్లో 6 వేల ఎకరాలకు పడిపోయిన విస్తీర్ణం

బుట్టాయగూడెం: ఏజెన్సీ ప్రాంతంలోని గ్రామాల్లో పోడు వ్యవసాయం తర్వాత అత్యధికంగా గిరిజనులు జీడిమామిడి సాగు చేస్తున్నారు. ఐటీడీఏ ద్వారా ఈ ప్రాంతంలో సుమారు 20 వేల ఎకరాల వరకూ రైతులు జీడిమామిడి పంట వేశారు. ప్రస్తుతం జీడిమామిడి పంటల స్థానంలో రైతులు ప్రత్యామ్నాయ పంట వైపు దృష్టి సారించారు. దీంతో జీడిమామిడి తోటలను తొలగిస్తున్నారు. తోటల స్థానంలో పామాయిల్, మొక్కజొన్న, పొగాకు, అరటి వంటి వాణిజ్యపంటలను పండిస్తున్నారు. ప్రస్తుతం 5 వేల ఎకరాల వరకూ రైతులు జీడిమామిడి తోటలను తొలగించినట్లు సమాచారం. భవిష్యత్‌లో ఇంకా తగ్గే అవకాశం ఉంది.

ప్రోత్సాహం కరువు

ఐటీడీఏ పరిధిలో ఉన్న గిరిజన మండలాల్లో గిరిజన రైతులు జీడిమామిడి పంటల సాగుతో అధిక లాభాలను సాధిస్తున్నారు. అయితే గిట్టుబాటు ధరతోపాటు సరైన ప్రోత్సాహం ఐటీడీఏ ద్వారా అందించకపోవడం వల్ల వాణిజ్యపంటలపై రైతులు దృష్టి సారిస్తున్నారు. ముఖ్యంగా కొండరెడ్డి గ్రామాల్లో పోడు వ్యవసాయం తర్వాత జీడిమామిడి పంటలే ప్రధానం. దీనిని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందంటున్నారు.

కట్టెలుగా మారుతున్న జీడిమామిడి తోట

గిరిజన ప్రాంతంలో ఎంతో మంది రైతులకు లాభాలు అందించిన జీడిమామిడి తోటలు నేడు నరికేస్తున్నారు. బుట్టాయగూడెం, జీలుగుమిల్లి మండలాల్లో అత్యధికంగా జీడిమామిడి పంటలను రైతులు తొలగిస్తున్నారు. చెట్లను నరికి కట్టెలుగా మార్చి బేరన్ పుల్లగా తరలిస్తున్నారు. కలపను తరలించి ఆ భూముల్లో ప్రత్యామ్నాయ పంటల కోసం భూములను సిద్ధం చేస్తున్నారు.

జీడిమామిడి రైతులను ప్రోత్సహించాలి



జీడిమామిడి రైతులను ఐటీడీఏ అధికారులు ప్రోత్సహించాలి. జీసీసీ ద్వారా జీడిగింజలను కొనుగోలు చేసి గిరిజన రైతులు ఆదాయం పొందేలా చూడాలి. రాను రానూ జీడిమామిడి పంటల విస్తీర్ణం తగ్గిపోతోంది.

కారం రాఘవ, న్యూడెమోక్రసీ నేత, అలివేరు, బుట్టాయగూడెం మండలం

పీ-సెట్ నోటిఫికేషన్ విడుదల

దెందులూరు: ఆంధ్రప్రదేశ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (పీ సెట్) నోటిఫికేషన్ నాగార్జున యూనివర్సిటీ విడుదల చేసిందని గోపన్నపాలెం ప్రభుత్వ వ్యాయామ విద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.నతానియేలు అన్నారు. ఆదివారం వ్యాయామ కళాశాలలో ఆయన మాట్లాడుతూ బీపీఈడీ, డీపీఈడీ కోర్సులలో అర్హులైన అభ్యర్థులు ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ నెల 13 వరకు దరఖాస్తు చేసుకోవటానికి గడువు ఉందన్నారు.

మద్యం మత్తులో కింద పడి వ్యక్తి మృతి

ముసునూరు: మద్యం మత్తులో కింద పడడంతో తలకు తీవ్రగాయమై వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. మండలంలోని రమణక్కపేటకు చెందిన తోట మురళీకృష్ణ(31) శనివారం సాయంత్రం మద్యం సేవించి ఇంటికి వచ్చాడు. అర్ధరాత్రి మూత్ర విసర్జనకు బయటకు వస్తూ, తూలి గచ్చుపై పడ్డాడు. గచ్చు కోణం తలకు తగలడంతో తీవ్రంగా గాయపడి, అధిక రక్తస్రావమైంది. క్షతగాత్రుడిని బంధువులు నూజివీడు ఏరియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు.

ద్వారకాతిరుమలలో భారీ వర్షం



ద్వారకాతిరుమలలోని లింగయ్య చెరువు వద్ద వర్షపు నీటిలోంచి వెళ్తున్న వాహనాలు

ద్వారకాతిరుమల: మండల కేంద్రమైన ద్వారకాతిరుమలలో ఆదివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఉన్నట్టుండి ఒక్కసారిగా మొదలైన వర్షం అరగంట పాటు ఏకధాటిగా పడింది. దాంతో డ్రైనేజీలు పొంగి పొర్లడంతో మురుగు, చెత్తాచెదారం రోడ్లపైకి చేరింది. వర్షపు నీరు రోడ్లపై ప్రవహించడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కొండపై నుంచి లింగయ్య చెరువులోకి భారీగా నీరు ప్రవహించింది.

వశిష్ట గోదావరికి హారతులు



సిద్ధాంతంలో గోదావరికి హారతులిస్తున్న భక్తులు

పెనుగొండ: పౌర్ణమి సందర్భంగా ఆదివారం గోదావరి మాతకు హిందూ ధర్మ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో హారతులనిచ్చారు. కలగ భద్రుడు అర్చకత్వంలో ఏకముఖ, ద్విముఖ, చతుర్ద, పంచమ, కుంభ, నక్షత్ర, పూర్ణ, కుంభ, సర్ప హారతులనిచ్చారు. కార్యక్రమంలో హిందూ ధర్మ సమితి సభ్యులు పాల్గొన్నారు.

నాటుసారా కేంద్రాలపై దాడి



నాటుసారాను పారబోస్తున్న పోలీస్ సిబ్బంది

కుక్కునూరు: నాటుసారా తయారీ కేంద్రాలపై ఆదివారం కుక్కునూరు పోలీసులు దాడి చేసి 600 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. కుక్కునూరు ఎస్సై రాజారెడ్డి వివరాల ప్రకారం, మండలంలోని సీతారామనగరం గ్రామ శివారులోని కిన్నెరసాని వాగు ఒడ్డున నాటుసారా తయారు చేస్తున్నారన్న సమాచారం మేరకు ఆదివారం దాడులు నిర్వహించినట్టు చెప్పారు. దాడులలో సారా తయారు చేసేందుకు సిద్ధంగా ఉంచిన 600 లీటర్ల బెల్లం ఊటను స్వాధీనం చేసుకోని ధ్వంసం చేసినట్టు తెలిపారు. 10 లీటర్ల నాటుసారాను ఓ వ్యక్తి నుంచి స్వాధీనం చేసుకుని అతనిపై కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. సారా నియంత్రణకు పోలీసులు తీసుకుంటున్న చర్యలకు ప్రజలు సహకరించాలని భవిష్యత్తులో ఇలాంటి దాడులు కొనసాగుతాయని తెలిపారు.

పరిహారం లేదు.. పథకమూ అందదు

- కూటమి ప్రభుత్వ నిర్వాకం
- ఘొల్లుమంటున్న విలీన మండలాల రైతులు



కుక్కునూరులో ఏర్పాటు చేసిన 3 ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్

కుక్కునూరు: రాష్ట్రంకోసం.. పోలవరం ప్రాజెక్టు కోసం సర్వం త్యాగం చేసిన విలీన మండలాల రైతులపై కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. పోలవరం ముంపు పేరుతో అటు అభివృద్ధి పనులు చేయకుండా, ఇటు పరిహారం ఇవ్వకపోవడమే కాకుండా ప్రభుత్వ పథకాలు కూడా వారికి అందకపోవడంతో నిర్వాసితులు తామేం పాపం చేశామని వాపోతున్నారు. రైతుకు పెట్టుబడి సాయం కింద ఇస్తామన్న అన్నదాత సుఖీభవ రూ.7 వేలు ఆర్థిక సాయం గత ప్రభుత్వం పట్టాదారు లేకపోతే వారి వారసులకు అందించగా కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక నామినీలను అనర్హులుగా పేర్కొంది. ఆ తరువాత రైతుల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తం కావడంతో మరలా వారంరోజులు సమయం ఇచ్చి ఆన్‌లైన్ చేయించుకునే అవకాశం కల్పించింది. దీంతో చాలా మంది రైతులు అన్నదాత సుఖీభవ పథకానికి దూరమయ్యారు.

ఎల్‌టీ అగ్రికల్చర్ కలెక్షన్లు లేవు

ప్రభుత్వం వ్యవసాయం కోసం అందించే ఎల్‌టీ అగ్రికల్చర్ కనెక్షన్‌ను తాజాగా రైతులకు దూరం చేసింది. గత జనవరి వరకు ప్రభుత్వం కొత్త అగ్రికల్చర్ కనెక్షన్‌లు మంజూరు చేయగా ప్రస్తుతం ఎల్‌టీ అగ్రికల్చర్ కనెక్షన్ కొరకు స్థానిక సబ్‌స్టేషన్‌కు రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు వెళ్లిన రైతులకు వెబ్‌ల్యాండ్ ఫ్రీజ్‌లో ఉండడంతో ఆధార్ కార్డ్ నెంబర్‌లు టైప్ చేస్తే ఆన్‌లైన్‌లో ఎటువంటి డేటా చూపించడంలేదని విద్యుత్ సిబ్బంది చెబుతున్నారు. దీంతో రైతులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. మండలంలో ముంపునకు గురవుతున్న భూములకు సంబంధించి పోలవరం భూసేకరణ పూర్తికాగా ఇంకా ముంపునకు గురికాని భూములు దాదాపు 50 శాతంకు పైగా ఉన్నాయి. ఇప్పుడు ఆ భూ యజమానులు మా భూములకు పరిహారం అయినా అందించండి లేకపోతే సాగు చేసుకునేందుకు విద్యుత్ కనెక్షన్ అయినా అందించాలని కోరుతున్నారు. అంతేకాక రాష్ట్రమంతా ఓ న్యాయం మాకో న్యాయమా అని బహిరంగంగానే కూటమి ప్రభుత్వ తీరును విమర్శిస్తున్నారు.

బిందు సేద్యం దూరం

ప్రభుత్వం ఉద్యాన రైతులకు అందించే బిందు సేద్యాన్ని కూడా విలీన రైతులు దరఖాస్తు చేసుకునే అవకాశం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బిందు సేద్యం చేస్తున్న గిరిజనేతర రైతులకు కేంద్ర ప్రభుత్వం 90 శాతం సబ్సిడీ ఇస్తుండగా, గిరిజన రైతులకు వందశాతం సబ్సిడీ ఇస్తుంది. ప్రస్తుతం బిందు సేద్యం కోసం దరఖాస్తు చేసుకునేందుకు వెబ్‌ల్యాండ్ ఫ్రీజింగ్ కారణంగా జియోట్యాగింగ్ చేసుకునేందుకు పలు గ్రామాల పేర్లు చూపించకపోవడంతో రైతులకు బిందు సేద్యానికి దరఖాస్తు చేసుకునే అవకాశం లేదని అధికారులు చెబుతున్నారు.

ముంపులేని భూమిని ఎలా సాగుచేసేది?



“ నాకు కివ్వాక గ్రామంలో 2.5 ఎకరాల సాగు భూమి ఉంది. సదరు భూమి ముంపులో లేదు. ఆ భూమిలో సాగు చేసుకునేందుకు అగ్రికల్చర్ కనెక్షన్ కొరకు దరఖాస్తు చేసుకుందామంటే విద్యుత్ సిబ్బంది ఆన్‌లైన్ చేసేందుకు మీ గ్రామం సైట్‌లో చూపించడంలేదంటున్నారు. మా భూములకు పరిహారం అయినా ఇవ్వండి లేదంటే విద్యుత్ కనెక్షన్‌కు అవకాశం కల్పించండి.

– పగ్గిళ్ల ప్రసాద్, కివ్వాక, కుక్కునూరు మండలం

డ్రిప్‌కు దరఖాస్తు చేసుకోలేక పోతున్నాం



మా భూములకు సంబంధించి వెబ్ ల్యాండ్ ఫ్రీజింగ్‌లో ఉండడంతో మిర్చి తదితర పంటలకు డ్రిప్ వేసుకునేందుకు దరఖాస్తు చేసుకునే అవకాశం లేకుండా పోయింది. ముంపులో లేని భూములకు పథకాలు వర్తింపజేసేలా అధికారులు చర్యలు చేపట్టాలి.

– మచ్చా రాజులు, ఇసుకపాడు, కుక్కునూరు మండలం

ఆన్‌లైన్‌లో చూపించడం లేదు

వ్యవసాయ విద్యుత్ మోటార్ కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకునే రైతుల ఆధార్ వివరాలు కుక్కునూరు మండల వెబ్ ల్యాండ్ ఫ్రీజింగ్‌లో ఉండడంతో రిజిస్ట్రేషన్ చేసే సమయంలో ఆన్‌లైన్‌లో రైతుల వివరాలు చూపించడం లేదు. దీంతో రైతులకు కొత్త కనెక్షన్ పొందే అవకాశం లేకుండా పోయింది. ఈ సమస్యకు పరిష్కారం చూపాలి.

– ఎంఎం పోపారావు, అసిస్టెంట్ ఇంజనీర్, కుక్కునూరు

పెద్దింట్లమ్మ దేవస్థానంలో భక్తుల రద్దీ



కొల్లేటికోట పెద్దింట్లమ్మ దేవస్థానం వద్ద భక్తులు

కైకలూరు: కొల్లేటికోట పెద్దింట్లమ్మ దేవస్థానం భక్తులతో ఆదివారం కిటకిటలాడింది. సమీప జిల్లాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు విచ్చేశారు. దేవస్థాన సమీప పవిత్ర కోనేరులో స్నానాలు ఆచరించి అమ్మవారికి వేడి నైవేద్యాలను సమర్పించారు. ఆలయ ఉప ప్రధాన అర్చకుడు పేటేటి పరమేశ్వరశర్మ పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయ ఈవో కూచిపూడి శ్రీనివాసు మాట్లాడుతూ రూ.19,185 ఆదాయం వచ్చిందని తెలిపారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

దెందులూరు: రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. సీతంపేట సమీపంలోని రైల్వేస్టేషన్ వద్ద వ్యక్తి మృతదేహాన్ని గుర్తించారు. అతని ముఖం గుర్తించడానికి వీలు లేకుండా ఉంది. మృతుడు ఎరుపు రంగు చొక్కా ధరించాడు. మృతుడి వివరాలు తెలియాల్సి ఉందని.. ఇతర వివరాలకు ఏలూరు రైల్వే పోలీసులను సంప్రదించాలన్నారు.

ప్రమాదభరితంగా జాతీయ రహదారి



స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద ప్రమాదభరితంగా ఎన్‌హెచ్ రోడ్డు

ఆకివీడు: ఆకివీడు జాతీయ రహదారి నె.165 పలు చోట్ల ప్రమాదభరితంగా మారింది. ఇటీవల కురిసిన వర్షాలకు పలు చోట్ల గుంతలు పడి, వాహన చోదకులకు ఇబ్బందికరంగా మారింది. స్థానిక సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద ఇటీవల డ్రెయిన్ తవ్వడంతో రోడ్డు మార్జిన్ డ్రెయిన్‌లోకి కుంగిపోయింది. వాహనాలు రోడ్డు మార్జిన్‌లోకి వెళితే తిరగబడే ప్రమాదం ఉందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి రోజూ వందలాది మంది వెళుతుండడం వల్ల అక్కడ నడవడానికి కూడా జాగాలేదని పలువురు వాపోతున్నారు.

పాత కక్షల నేపథ్యంలో దాడి

పెదవేగి: పాతకక్షల నేపథ్యంలో ఇద్దరు యువకులు దాడి చేసుకున్న సంఘటన చర్చనీయాంశమైంది. స్థానికుల వివరాల ప్రకారం.. పెదవేగి మండలం ముందూరు గ్రామానికి చెందిన వేముల దానయ్య కుమారుడు వేముల సాయి, పాత అదే గ్రామానికి చెందిన మొర్ల రాంబాబు పాత కక్షల నేపథ్యంలో ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. గాయపడిన ఇద్దరినీ ఏలూరు ఆసుపత్రికి తరలించారు.

క్లుప్తంగా

టీబీ వ్యాధిగ్రస్తులకు కిట్ల పంపిణీ

పెంటపాడు: సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా ప్రత్తిపాడు ట్రిపుల్‌ఎఫ్ కర్మాగారం, స్వాభిమాన్ ట్రస్టుల ఆధ్వర్యంలో టీబీ వ్యాధిగ్రస్తులకు సుమారు రూ.10 వేల విలువైన టీబీ కిట్లను ఉచితంగా అందించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ల సూచనల మేరకు ఈ వ్యాధిగ్రస్తులను గుర్తించారు. కాగా సుమారు 50 మందికి జీడిపప్పు, బెల్లం, రాగిపిండి, పప్పు దినుసులు, ఇతర పోషకాహారం పదార్థాలను కిట్ల రూపంలో పంపిణీ చేశారు. సాయం పొందిన వారు ట్రిపుల్ ఎఫ్ కర్మాగార అధినేత ఓంప్రకాష్ గోయంకా, సీమా గోయంకా తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ సురేంద్ర, డాక్టర్ రవికుమార్, ట్రిపుల్‌ఎఫ్ కర్మాగార ప్రతినిధులు జనార్ధన్, శ్రీనివాసరెడ్డి, వేమల శ్రీనివాస్, సత్యనారాయణ, ఇతర విభాగాల సిబ్బందితో పాటు, సాభిమాన్ ట్రస్టు ప్రతినిధులు పాల్గొన్నారు.

షెడ్డు ప్రారంభం

తాడేపల్లిగూడెం రూరల్: ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణకుగాను మండలంలోని ఆరుగొలను విశ్వేశ్వరస్వామి వారి ఆలయం వద్ద నిర్మించిన షెడ్డును ఆదివారం వెంకటరమణ సేవా చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు కొలనువాడ పెదకృష్ణంరాజు ప్రారంభించారు. చిక్కాల సీతారామయ్య జ్ఞాపకార్థం వారి కుమారుడు చిక్కాల సత్యనారాయణ ఈ షెడ్డును ఏర్పాటు చేశారు. అనంతరం ఇటీవల గౌరవ డాక్టరేట్ అందుకున్న పెదకృష్ణంరాజును సన్మానించారు. సర్పంచ్ పీతల బుచ్చిబాబు, ఉప సర్పంచ్ అడపా అప్పలరాజు, గ్రామస్తులు మద్దుకూరి ధనరాజు, ఆత్మబంధువులం సేవా సంస్థ వ్యవస్థాపకుడు శీతాళం కిరణ్ పాల్గొన్నారు.

ఇసుక మాఫియాపై శాసన మండలిలో ప్రస్తావించాలి



ఎమ్మెల్సీ వంక రవీంద్రకు వినతి పత్రం అందిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

పెనుగొండ: ఆచంటలో అక్రమంగా జరుగుతున్న ఇసుక దందాపై శాసనమండలిలో ప్రస్తావించి, ప్రభుత్వాన్ని నిలదీయాలని ఎమ్మెల్సీ వంక రవీంద్రను వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు సుంకర సీతారామ్, కర్రి వేణుబాబు, కోట వెంకటేశ్వరరావు, గుబ్బల వీర బ్రహ్మం కోరారు. ఈ మేరకు ఆదివారం ఎమ్మెల్సీ రవీంద్రనాథ్‌ను కలిసి వినతిపత్రం అందించారు. సీఆర్‌జెడ్ పరిధిలో ఇసుక తవ్వకాలకు నిషేధం ఉన్నప్పటికీ నియోజకవర్గానికి చెందిన రాంబాబు, ముఖ్య నాయకులతో కలిసి అక్రమంగా తవ్వేశారని ఆరోపించారు. అక్రమ నిల్వలు పెట్టి అధిక ధరలకు విక్రయాలు చేస్తున్నారన్నారు. తక్షణం చట్టపరమైన చర్యలు తీసుకునే విధంగా సమస్యను లేవనెత్తాలని కోరారు.

ఉచిత వైద్యం, విద్య దూరం చేయడం దారుణం

పెనుమంట్ర: రాష్ట్రంలో పేదవాడికి ఉచిత వైద్యం, విద్యార్థులకు వైద్య విద్య దూరం చేసేందుకు కూటమి ప్రభుత్వం నిర్ణ యం తీసుకోవడం దారుణమని పెనుమంట్ర జెడ్పీటీసీ సభ్యురాలు కర్రి గౌరీ సుభాషిణి మండిపడ్డారు. ఈ మేరకు ఆదివారం ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు. వైఎస్సార్ సీపీ హయాంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 17 మెడికల్ కళాశాలలకు అనుమతి తీసుకొచ్చి, ఐదు కళాశాలలను పూర్తి చేశారని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మిగిలిన వాటిని పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాల్సి ఉండగా వాటిల్లో పది కళాశాలలను ప్రైవేటుపరం చేయడం ఏంటి? అని ప్రశ్నించారు. రాష్ట్రంలో నాలుగు సార్లు ముఖ్యమంత్రిగా పని చేసిన చంద్రబాబు తన హయాంలో ఒక్క మెడికల్ కాలేజీ కూడా రాష్ట్రానికి తీసుకురాలేకపోయా రని ఆమె విమర్శించారు. కూటమి ప్రభుత్వ అరాచక, రద్దుల పాలనను ప్రజలు గమనిస్తున్నారని, రాబోయే కాలంలో కూటమి పార్టీలకు ప్రజలే బుద్ధి చెబుతారని పేర్కొన్నారు.

కొతాలపర్రులో గజేంద్ర మోక్షం

పెనుగొండ: రెండో శ్రీరంగంగా పేర్గాంచిన కొతాలపర్రులోని స్వయంభుః కేశవస్వామి ఆలయంలో ఆదివారం గజేంద్ర మోక్షం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. పవిత్రోత్సవాల్లో భాగంగా ఉదయంనుంచి కేశవ స్వామికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించి, అనంతరం అలంకరించి భక్తులకు దర్శనం ఏర్పాటు చేశారు. పూజా కార్యక్రమాలు అనంతరం గజేంద్ర మోక్షం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయాధికారులు, భక్తులు పాల్గొన్నారు.

రాజరాజేశ్వరికి గురుబ్రహ్మ అవార్డు

పాలకొల్లు సెంట్రల్: స్థానిక శ్రీ అద్దేపల్లి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ అటానమస్ కళాశాల ప్రిన్సిపాల్ తిరువీధుల రాజరాజేశ్వరి గురుబ్రహ్మ అవార్డు అందుకున్నా రు. విశాఖపట్నానికి చెందిన ప్రముఖ సేవా సంస్థ మదర్ థెరిస్సా సోషల్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఆదివారం విజయవాడ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటుచేసిన పురస్కార మహోత్సవ కార్యక్రమంలో ఆ సంస్థ కార్య నిర్వాహక సభ్యులు, విజయవాడ నగర ప్రముఖుల చేతులమీదగా రాజరాజేశ్వరి ఈ అవార్డును అందుకున్నారు.

నిలువెల్లా నిర్లక్ష్యం

- తప్పుల తడకగా ధ్రువ పత్రాల జారీ
- అఫిడవిట్ల సమర్పణకు ఆర్థిక భారం
- ఇబ్బందులు పడుతున్న దరఖాస్తుదారులు

తాడేపల్లిగూడెం అర్బన్: జనన, మరణ ధ్రువ పత్రాల జారీలో మున్సిపల్ సిబ్బంది నిలువెల్లా నిర్లక్ష్యం వహిస్తున్నారు. జనన ధ్రువ పత్రాలు మంజూరు చేయడంలో తల్లిదండ్రుల పేర్లు లేకపోతే బిడ్డ పేరును అక్షర దోషాలతో నమోదు చేసి, తదితర ధ్రువ పత్రాలను అధికారులు జారీ చేస్తున్నారు. దరఖాస్తుదారులు కొందరు నిరక్షరాస్యులు కావడంతో ఆ ధ్రువ పత్రంలో తమ పేర్లు తప్పులు దొర్లాయని తెలియకపోవడంతో భవిష్యత్‌లో విద్య, వైద్యం, ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దరఖాస్తులు చేసుకున్న సమయంలో తమ పేర్లు తప్పులు దొర్లాయని తెలియడంతో అవాక్కవుతున్నారు. తిరిగి వాటిని సరి చేసుకునేందుకు దరఖాస్తులను మరలా అందజేస్తున్నారు. ఈ తప్పులు సరి చేసుకునేందుకు దరఖాస్తులు చేసుకునే సమయంలో అఫిడవిట్లు అందజేయడం, న్యాయవాదుల ద్వారా నోటరీ చేయించుకునేందుకు దరఖాస్తుదారులు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

జిల్లా అంతా ఇదే తంతు

ఈ సమస్యలు ఒక్క ప్రాంతంలోనే కాకుండా జిల్లా వ్యాప్తంగా ఉన్న మున్సిపాల్టీలు, పంచాయతీ కార్యాలయాల్లో ఇదే తంతు నడుస్తుంది. ప్రభుత్వ ఆసుపత్రుల్లోనూ ఇదే తంతు కొనసాగుతోంది. ఉదాహరణకు ఉంగుటూరు మండలానికి చెందిన రంగారావు దంపతులు తమకు పుట్టిన బిడ్డకు జనన ధ్రువ పత్రం పొందేందుకు తమ పంచాయతీ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నారు. వారి ఇంటి పేరు కట్టూరి అని నమోదు చేయవలసి ఉంది. కాని కరుటూరి అని ఇంటి పేరును తప్పుగా నమోదు చేసి మంజూరు చేశారు. ధ్రువ పత్రాన్ని మంజూరు చేసే సమయంలో తల్లిదండ్రులకు అవగాహన లేక తమ ఇంటి పేరు తప్పుగా నమోదైనట్లు గ్రహించలేదు. తమ బిడ్డను స్కూల్‌లో చేర్పేందుకు తీసుకెళ్లగా అక్కడి ఉపాధ్యాయులు వారి ఆధార్ కార్డు, రైస్ కార్డును పరిశీలించి జనన మరణ, ధ్రువ పత్రాల జారీ విభాగ అధికారులు రంగారావు ఇంటి పేరును కట్టూరి అని నమోదు చేయాల్సి ఉండగా కరుటూరి అని నమోదు చేశారని తెలిపారు. దీంతో రంగారావు దంపతులు సంబంధిత కార్యాలయానికి వెళ్లి తమ ఇంటి పేరును సరిచేసి ధ్రువపత్రాన్ని ఇవ్వమని కోరగా తప్పుగా నమోదైన పేర్లను సరి చేయుటకు దరఖాస్తు చేసుకోవాలని, వీటితో పాటు లాయర్ ద్వారా నోటరీ చేయించిన అఫిడవిట్‌ను అందజేయాలని అక్కడి అధికారులు తెలిపారు. దీంతో ఆ దంపతులు నిరక్షరాస్యులు కావడంతో సంబంధిత పత్రాలను సిద్ధం చేసుకోవడానికి మరో వ్యక్తిని ఆశ్రయించగా కమీషన్ల పేరుతో దరఖాస్తు చేసేందుకు సుమారు రూ.3 వేలు ఖర్చయ్యాయి. ఇదే విధంగా పెనుగొండకు చెందిన ఒక మహిళ తాడేపల్లిగూడెం ప్రభుత్వ ఆసుపత్రిలో ఒక బిడ్డకు జన్మనిచ్చింది. ఆసుపత్రిలో ఉన్న జనన, మరణ విభాగం సిబ్బంది తల్లి పేరును తప్పుగా నమోదు చేసి ధ్రువ పత్రాన్ని అందజేశారు. ఆ మహిళ కూడా తమ బిడ్డను పాఠశాలలో చేర్పించేందుకు పెనుగొండలోని పాఠశాలకు వెళ్లగా బిడ్డ తల్లిదండ్రుల పేర్లు తప్పులతో నమోదయ్యాయని వాటిని సరిచేయించుకొని సక్రమమైన జనన ధ్రువ పత్రాన్ని సమర్పించాలని చెప్పడంతో ఆ మహిళ తాడేపల్లిగూడెం ఆసపత్రిని ఆశ్రయించగా అఫిడవిట్లు, దరఖాస్తులు అంటూ నానా ఇబ్బందులు పడి ఎట్టకేలకు మరో ధ్రువపత్రాన్ని తీసుకున్నారు. అధికారుల నిర్లక్ష్య ధోరిణి కారణంగా జనన, మరణ ధ్రువపత్రాలు తప్పుల తడకగా నమోదు చేసి అందజేస్తూ కారణంగా దరఖాస్తుదారులు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



తల్లిదండ్రుల పేర్లు తప్పులతో నమోదు చేసిన జనన ధ్రువపత్రం

పాఠశాలల్లోనూ ఇదే తీరు

పదో తరగతి విద్యార్థులకు హాల్ టిక్కెట్లు మంజూరు చేసే సమయంలో కొన్ని పాఠశాలల్లోని సిబ్బంది నిర్లక్ష్యం వహించడంతో తల్లిదండ్రుల పేర్లను లేక విద్యార్థుల పేర్లను తప్పుగా నమోదు చేసి సంబంధిత ఎస్ఎస్‌సీ బోర్డుకు పంపుతున్నారు. ఇక్కడి పాఠశాలల సిబ్బంది పంపించిన వివరాలను నమోదుచేసి పేర్లు తప్పులతోనే హాల్ టిక్కెట్లు మంజూరు చేస్తున్నారు. ఇది గ్రహించిన తల్లిదండ్రులు పేర్లను సరి చేయించుకునేందుకు విజయవాడలోని ఎస్ఎస్‌సీ బోర్డును ఆశ్రయిస్తున్నారు. సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా ఆర్థిక ఇబ్బందులతో పాటు శారీరక మానసిక క్షోభకు గురవుతున్నామని దరఖాస్తుదారులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా పాఠశాలల్లోనూ, ప్రభుత్వ ఆసుపత్రుల్లోనూ, పంచాయతీ కార్యాలయాల్లోనూ సంబంధిత అధికారులు దరఖాస్తులను, దరఖాస్తుతో పాటు అందజేసిన ఆధార్‌కార్డు, రైస్ కార్డులను పరిశీలించి తప్పులు లేని సక్రమమైన ధ్రువ పత్రాలను మంజూరు చేయాలని కోరుతున్నారు.

తప్పులతో హాల్‌టికెట్ మంజూరు

మా అమ్మాయి 2024–25 సంవత్సరంలో పదో తరగతి చదివింది. పరీక్షల సమయంలో అందజేసిన హాల్‌టికెట్‌లో ఇంటి పేరును తప్పులతో నమోదుచేశారు. దీంతో పాఠశాల అధికారుల వద్ద నుంచి డిక్లరేషన్లు రాయించుకొని విజయవాడలోని ఎస్ఎస్‌సీ బోర్డును ఆశ్రయించి సక్రమమైన సర్టిఫికెట్‌ను తెచ్చుకున్నాం. ఆర్థిక భారంతో పాటు అధిక శ్రమను భరించాల్సి వచ్చింది.

– మానుకొండ భారతి, తాడేపల్లిగూడెం

పాఠశాలకు వెళితే పేర్లు సరిచేసుకు రమ్మన్నారు

నాకు తాడేపల్లిగూడెం ప్రభుత్వ ఆసుపత్రిలో అబ్బాయి పుట్టాడు. వాడికి ఐదు సంవత్సరాలు వచ్చిన తరువాత పాఠశాలలో చేర్పించేందుకు వెళ్లగా అక్కడి అధికారులు తల్లిదండ్రుల పేర్లు తప్పులతో నమోదయ్యాయని సరి చేయించుకొని మరో జనన ధ్రువ పత్రాన్ని తీసుకురమ్మని చెప్పారు. దీంతో నేను పెనుగొండనుంచి తాడేపల్లిగూడెంలోని ఆసుపత్రికి పలుమార్లు రాకపోకలు సాగించగా రెండునెలలకు మా కుమారుడి జనన ధ్రువ పత్రాన్ని అందజేశారు. ఆర్థిక ఇబ్బందులు, పలు మార్లు తిరగలేక అత్యధిక శ్రమ మానసిక బాధను అనుభవించాను.

– పేరా మాధవి, పెనుగొండ

లడ్డూ వేలం

తాడేపల్లిగూడెం (టీఓసీ): గణనాథుడి ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలని పేరిచర్ల ఫౌండేషన్ చైర్మన్ పేరిచర్ల మురళీకృష్ణం రాజు అన్నారు. స్థానిక రామారావు పేట గణేష్ యూత్ గణపతి నవరాత్రి వేడుకలు సందర్భంగా చిన్నారులకు పలు రకాల ఆటలు ఆడించి విజేతలకు బహుమతులు అందజేశారు. వేలంలో లడ్డూను రూ.27 వేలకు బోళ్ల రాము దక్కించుకున్నారు. బత్తుల రాజ్ కుమార్, అనుపోజు మహేష్, సూరిబాబు, రుద్ర వినయ్, పెదకాపు, శ్రీనివాస్ యూత్ సభ్యులు, లయన్స్‌క్లబ్ డైమండ్స్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఉపవాస కూడికలు

పెంటపాడు: మండలంలోని కోరిమిల్లి గ్రామంలోని ప్రవచన దేవుని మందిరంలో ఉపవాస కూడికలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈ కూడికలు ఆదివారం రాత్రికి రెండో రోజుకు చేరాయి. ఈ సందర్భంగా పాస్టర్ జె.శామ్యూల్ రాజు ఆధ్వర్యంలో మండపేటకు చెందిన స్పర్జన్‌రాజు, ఎస్.శామ్యూల్, గూడేనికి చెందిన ఎల్.రాజు, ద్రాక్షారామానికి చెందిన జయరాజు, దువ్వకు చెందిన వినుతికుమార్, కిష్కింధపాలేనికి చెందిన జాషువా తదితరులు దేవుని వాక్యం అందిస్తారన్నారు. ప్రతిరోజూ ఉదయం 10, రాత్రి 7 గంటలకు ఈ కూడికలు నిర్వహిస్తారన్నారు.

జంపన వన సత్యనారాయణ మృతికి సంతాపం

తాడేపల్లిగూడెం (టీఓసీ): చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ ఉన్నతికి ఎంతో కృషి చేసిన సంస్థ ఉపాధ్యక్షుడు జంపన వన సత్యనారాయణ (81) మృతి చెందారు. చాంబర్ అధ్యక్షుడు, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఈతకోట తాతాజీ సంతాపం తెలిపారు.

రైతుల కష్టాలు ప్రభుత్వానికి పట్టవా?

మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు



తూర్పు విప్పర్రులో అన్నదాత పోరు పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి కారుమూరి

ఇరగవరం: రాష్ట్రంలో రైతుల కష్టాలు, యూరియా ఇబ్బందులు ప్రభుత్వానికి పట్టడం లేదని మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు ధ్వజమెత్తారు. రైతుల పక్షాన ఈనెల 9న చేపట్టనున్న వైఎస్సార్ సీపీ పోరుబాట కార్యక్రమం పోస్టర్లను ఆదివారం ఆయన తూర్పు విప్పర్రులో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ సీఎం వైఎస్ జగన్ పిలుపుమేరకు ఈ 9న యూరియా కొరతపై రైతులు, వైఎస్సార్ సీపీ నాయకులు తాడేపల్లిగూడెం ఆర్డీఓ కార్యాలయానికి తరలివెళ్లి ఆర్డీఓకు వినతిపత్రం సమర్పించారు. రైతులు, నాయకులు పెద్దఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. రైతుల సమస్యలపై కూటమి ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తోందన్నారు. యూరియా కోసం రైతులు క్యూలైన్లలో గంటలు కొద్దీ వేచి చేస్తున్నారన్నారు. గత వైఎస్సార్‌సీపీ పాలనలో రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు ఎరువులు, పురుగు మందులు పూర్తిస్థాయిలో అందించి వ్యవసాయాన్ని పండుగ చేశారని గుర్తు చేశారన్నారు. అయితే కూటమి ప్రభుత్వం రైతు సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందన్నారు. అనంతరం కారుమూరిని నాయకులు సత్కరించారు. వైఎస్సార్‌సీపీ గ్రామ అధ్యక్షుడిగా మాజీ సొసైటీ అధ్యక్షుడు సైపు రెడ్డి పెద్దిరాజును, కార్యదర్శిగా మామిడిశెట్టి శ్రీనును ఎన్నుకున్నారు. మండల పార్టీ అధ్యక్షుడు కొప్పిశెట్టి దుర్గాప్రసాద్, కో–ఆప్షన్ సభ్యుడు ఎస్కే మాబ్, నాయకులు వెలగల సాయిబాబారెడ్డి, కటారి రాంబాబు, పాలా మధు, సత్తి వెంకటరెడ్డి, గంటా అప్పారావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీమంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు

అయోమయంలో రైతన్నలు

అత్తిలి (పెనుమంట్ర): కూటమి ప్రభుత్వ పాలనలో రైతుల పరిస్థితి అయోమయంగా మారిందని మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం సాయంత్రం వైఎస్సార్ సీపీ అత్తిలి మండల కార్యకర్తల సమావేశం పార్టీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న కారుమూరి మాట్లాడుతూ మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాల హయాంలో వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి వైపు నడిపించి రైతులకు పండగగా మారిస్తే నేటి కూటమిప్రభుత్వంలోని టీడీపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యవసాయాన్ని దండగగా మార్చి రైతు కుటుంబాలు కన్నీళ్లుపెట్టే పరిస్థితిని తీసుకొచ్చారని ఆయన విమర్శించారు. రాష్ట్రంలో అవినీతి, అక్రమ దందాలతో అరాచక పాలన సాగుతుందని. ఏడాదిపాలనలోనే తణుకు ఎమ్మెల్యే రూ.1200 కోట్ల అక్రమార్జన దోపిడికి పాల్పడ్డారని కారుమూరి ఆరోపించారు. వైఎస్సార్ సీపీ రైతులకు అండగానిలిచేందుకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపుమేరకు రైతు పోరుబాట పేరుతో ఈనెల తొమ్మిదో తేదీన తాడేపల్లిగూడెం ఆర్డీవో కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమానికి రైతులు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలి రావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా రైతు పోరుబాట పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు బుధరాతి భరణి ప్రసాద్, జిల్లా పరిషత్ కో–ఆప్షన్ సభ్యుడు మహమ్మద్ అబి బుద్దిన్, సొసైటీ మాజీ అధ్యక్షుడు కె.శ్రీహరిరాజు, ఎంపీటీసీలు అడ్డారి శ్రీనివాసరావు, నాయకులు రంభ సూరిబాబు, కంకటాల సతీష్ పాల్గొన్నారు.

బార్‌లకు దరఖాస్తు చేసుకోండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎక్సైజ్ సీఐ స్వరాజ్యలక్ష్మి

తాడేపల్లిగూడెం: పట్టణంలోని నాలుగు బార్లకు దరఖాస్తు చేసుకోవాలని ఎక్సైజ్ సీఐ ఇ.స్వరాజ్య లక్ష్మి కోరారు. ఆదివారం పట్టణంలోని మద్యం వ్యాపారులతో తన కార్యాలయంలో సమావేశమయ్యారు. బార్లకు దరఖాస్తు చేసుకునేందుకు గడువును ఈ నెల 14వ తేదీ వరకు పొడిగించామన్నారు. ఆమె మాట్లాడుతూ గత పాలసీలో రూ.పది లక్షలు ఉండే దరఖాస్తు ఫీజును ఇప్పుడు రూ.5.10 లక్షలకు తగ్గించారన్నారు. బార్ తెరిచే సమయాన్ని ప్రస్తుతం ఉదయం పది గంటల నుంచి అర్ధరాత్రి 12 గంటల వరకు పెంచారు. గతంలో లైసెన్స్ ఫీజును రెండు దఫాలుగా చెల్లించాల్సి ఉంటే ప్రస్తుతం ఆరు దఫాలుగా చెల్లించే అవకాశం ఉందన్నారు. గూడెం పట్టణంలో మద్యం షాపు లైసెన్స్ ఫీజు రూ.65 లక్షలు, పర్మిట్ రూమ్ లైసెన్స్ ఫీజు రూ.6.5 లక్షలు రెండూ కలిపి 71.5 లక్షలు అవుతుండగా బార్ లైసెన్స్ ఫీజు కేవలం రూ.55 లక్షలు మాత్రమే అన్నారు. మద్యం దుకాణం కాల పరిమితి రెండు సంవత్సరాలు కాగా, బార్‌కు లైసెన్సు ఫీజు మూడు సంవత్సరాలన్నారు. బార్‌కు చెల్లించాల్సిన అదనపు సుంకం మద్యం అమ్మిన తరువాత ఒకటి రెండు నెలల్లో చెల్లించొచ్చన్నారు. బార్ కోసం దరఖాస్తు చేసుకున్నప్పుడు నాలుగు దరఖాస్తులు రాకపోతే చెల్లించిన దరఖాస్తు రుసుము తిరిగి ఇచ్చేస్తారన్నారు. వదంతులు నమ్మి మోసపోవద్దని ఆసక్తి కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

అమెరికా సుంకాలు ఉపసంహరించుకోవాలి



నిరసన తెలుపుతున్న సీపీఐ, సీపీఎం నాయకులు

తణుకు అర్బన్: భారత్‌పై అమెరికా వేసిన సుంకాలు వెంటనే ఉపసంహరించుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పీవీ ప్రతాప్, సీపీఐ, సీపీఎం పట్టణ కార్యదర్శులు బొద్దాని నాగరాజు, అడ్డగర్ల అజయకుమారి అన్నారు. ఆదివారం స్థానిక నరేంద్ర సెంటర్ లో సీపీఐ, సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో వారు మాట్లాడారు. అమెరికా భారత దేశంపై 50 శాతం సుంకాలు వేయడం అన్యాయమన్నారు. భారత దేశంపై ట్రంప్ నోటికొచ్చినట్టు మాట్లాడుతున్న మోదీ స్పందించకపోవడం బాధాకరం అన్నారు. కార్యక్రమంలో నాయకులు గార రంగారావు, పుట్ట అమ్మిరాజు, బొద్దాని మురళి, బి. కిషోర్, బళ్ళ చిన వీరభద్రం, నాగరత్నం, వల్లూరి వెంకటేశ్వరావు,టీ. వెంకటేశ్వరావు, నూనె రాధాకృష్ణ, ఎం. రమేష్, భాస్కర రావు తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ మొదలైన డంపింగ్ యార్డు పొగ



యడ్లబజారు సెంటర్‌లో ఉన్న డంపింగ్ యార్డు నుంచి వస్తున్న పొగ



పెనుమదం రోడ్డులో పొగతో వాహనదారుల ఇబ్బందులు

పాలకొల్లు సెంట్రల్: స్థానిక యడ్లబజారు సెంటర్ వద్ద ఉన్న డంపింగ్ యార్డు నుంచి పొగ అత్యంత ప్రమాదకరంగా వస్తుంది. ఈ పొగ పీలిస్తే అనేక ఇబ్బందులకు గురయ్యే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. యడ్ల బజారు సెంటర్‌లో ఉన్న డంపింగ్ యార్డులో అంటుకున్న మంటలతో గత మూడు రోజులుగా వస్తున్న పొగ రోడ్డుపై కమ్మేస్తుంది. వేసవికాలమైతే వేడికి చెత్తలో ఉండే ప్లాస్టిక్ వ్యర్థాలు, మెడికల్ వంటి విషపూరితమైన రసాయనాలు అంటుకుని లేదా ఎవరైనా ఆకతాయిలు అంటించి ఉన్నా ఇలా పొగ వచ్చే అవకాశం ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. కానీ వర్షాకాలం కూడా ఇలా పొగ వ్యాపించడంతో యడ్లబజారు సెంటర్ నుంచి పెనుమదం వైపు వెళ్లే ద్విచక్ర వాహనదారులు అలాగే శంభునిపేట, బంగారు వారి చెరువుగట్టు, యడ్లబజారు సెంటర్ ప్రాంతాల్లో నివాసం ఉండే ప్రజలు పొగ ఇళ్లల్లోకి వచ్చేస్తుందని భయాందోళనలకు గురవుతున్నారు.

అనారోగ్య సమస్యల భయం

గతంలో రామయ్యహాలు వద్ద ఉన్న డంపింగ్ యార్డు నుంచి వచ్చిన పొగ వల్ల స్థానిక ప్రజలు ఊపిరితిత్తుల వ్యాధులతో ఆసుపత్రి పాలైన సంఘటనలు అనేకం ఉన్నాయి. ఆస్మాతో బాధపడే వారు తీవ్ర ఆందోళనలకు గురవుతున్నారు. రామయ్య హాలు పక్కన ఉన్న సూర్యతేజస్ నగర్ ప్రజల్లో కొందరు ఎంతో ఆనందంగా ఇళ్లు కట్టుకుని ఈ డంపింగ్ యార్డు నుంచి వస్తున్న పొగను భరించలేక ఇళ్లు ఖాళీ చేసి వెళ్లిపోయిన సందర్భాలు ఉన్నాయి. ప్లాస్టిక్ వ్యర్థాలు అంటుకుంటే అంత త్వరగా నిప్పు ఆరే అవకాశం ఉండదు. అంతే కాకుండా ప్లాస్టిక్ వ్యర్థాలతో పాటు మెడికల్ వ్యర్థాలు కూడా ఉండడంతో పొగ పీల్చ డం వల్ల అధికంగా అనారోగ్యాలకు గురయ్యే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. అంతే కాకుండా స్థానిక యడ్లబజారు సెంటర్ నందు వ్యాపారస్తులు, కనకదుర్గమ్మ, పంచముఖ ఆంజనేయస్వామి, అయ్యప్ప స్వామి ఆలయాలు, వెటర్నరీ ఆసుపత్రిలకు వచ్చే కస్టమర్లు, భక్తులు, జంతు ప్రేమికులు ఇలా ఈ సెంటర్లో అనేక మంది వస్తుంటారు. గత మూడు రోజులుగా ఈ పరిస్థితి చూసి కనీసం వ్యాపార సంస్థల వద్ద పది నిమిషాలు కూడా నిలబడలేకపోతున్నారని వ్యాపారస్తులు గగ్గోలు పెడుతున్నారు. ఈ పొగను అదుపులోకి తీసుకురాకపోతే ఊపిరితిత్తులకు సంబంధించిన వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉంటుందని స్థానికులు భయాందోళనలకు గురవుతున్నారు. సమస్యను మునిసిపల్ అధికారులు పరిష్కరించాలని కోరుతున్నారు.

ఇంటికే ఉచిత వైద్యసేవలు

తణుకు అర్బన్: సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్, నిసా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇంటింటికీ ఉచిత వైద్య కార్యక్రమంలో భాగంగా ఆదివారం తణుకు పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఇంటికే పరిమితమైన వృద్ధులకు వైద్యసేవలందించారు. ప్రముఖ నేత్ర వైద్యులు డాక్టర్ హుస్సేన్ అహ్మద్, సీనియర్ ఆర్థోపెడిక్ వైద్యులు డాక్టర్ నిమ్మగడ్డ అచ్యుతరామయ్య ప్రత్యేక వాహనం ద్వారా 9 మంది రోగుల ఇళ్లకు వెళ్లి వైద్యసేవలందించారు. అసోసియేషన్ సభ్యులు ఎం.రవిరిజనాల్డ్ ఆర్థిక సహకారంతో ఉచితంగా మందులు అందజేసినట్లు అసోసియేషన్ అధ్యక్షుడు అల్లూరి కరుణాకరచౌదరి తెలిపారు. అసోసియేషన్ అందిస్తున్న సేవలకు ప్రోత్సాహకంగా పట్టణానికి చెందిన కూదా వెంకట ప్రభాకరం రూ. 20వేలు, సభ్యులు గోదావరి మాణిక్యాలరావు రూ. 10వేలు విరాళంగా అందచేసినట్లు వివరించారు. ఉచిత వైద్యసేవలు అవసరమైనవారు 99853 43530, 90592 90717 నంబర్లలో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో సంఘ కోశాధికారి అర్జి భాస్కరరావు, సభ్యులు గిరిజాల నాగేశ్వరరావు, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా కుసుమ హరనాథ కల్యాణోత్సవం

ఆకివీడు: స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మందిరంలో కుసుమ హరనాథ కల్యాణోత్సవం ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. గత 50 ఏళ్లుగా ఈ ప్రాంతంలో కుసుమ హరనాథ్ జయంతి, కల్యాణోత్సవాల్ని నిర్వహిస్తున్న కాకర్ల దాసు మాట్లాడుతూ కుసుమ హరనాథ్ ఒక ఆధ్యాత్మిక గురువు అని, ఆయన దేవుడు ఎన్ని రూపాల్లో ఉన్న ప్రేమించడం, ఆరాధించడం చేయాలని శిష్యులకు బోధించారని చెప్పారు. తొలుత ప్రత్యేక అలంకరణలో కుసుమ హరనాథ్‌లకు గ్రామోత్సవం జరిపారు. కల్యాణ మహోత్సవాన్ని తిలకించేందుకు రాష్ట్ర నలుమూలల నుంచి, అలాగే తెలంగాణ, తమిళనాడు, బెంగాల్ తదితర ప్రాంతాల నుంచి భక్తులు హాజరయ్యారు.

ఎరువుల విక్రయ కేంద్రం ఆకస్మిక తనిఖీ



జుత్తిగ సొసైటీ ఆవరణలో రైతులతో మాట్లాడుతున్న జేసీ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి

పెనుమంట్ర: ఎరువులు, పురుగుమందులు కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరలకు విక్రయిస్తే సంబంధిత డీలర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి హెచ్చరించారు. ఆదివారం ఆయన జుత్తిగ వ్యవసాయ సహకార సంఘంలోని ఎరువుల విక్రయ కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రామ రైతులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి ఖరీఫ్ లో రైతుల పడుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఎరువుల కొరత విక్రయాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఎక్కడ ఎరువులు కొరత లేదని యూరియా పూర్తిగా అందుబాటులో ఉందని రైతులెవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఈ పంట నమోదు పనులను అధికారులు వేగవంతం చేయాలని, ప్రతి రైతు వివరాలు నమోదు చేయాలని వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా స్థానిక అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలనీ వ్యవసాయ సంచాలకులను ఆదేశించారు. కార్యక్రమంలో నరసాపురం సబ్ కలెక్టర్ దాసిరాజు, మార్టేరు వ్యవసాయ సంచాలకులు ఎంవీ రమేష్, తహసీల్దార్ వైవీ రవికుమార్ పాల్గొన్నారు.

ఆర్యవైశ్య విద్యార్థులకు ప్రతిభ అవార్డులు

పెనుగొండ: ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లోని ప్రతిభావంతులైన ఆర్యవైశ్య విద్యార్థులకు ప్రతిభ సన్మాన్–2025 అవార్డులు అఖిల భారత శ్రీవాసవీ పెనుగొండ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఇవ్వనున్నట్లు ట్రస్ట్ ఉపాధ్యక్షుడు బొండాడ రాంపండు తెలిపారు. ఆదివారం పెనుగొండలోని వాసవీ శాంతి ధామ్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ విద్యలోనూ, క్రీడల్లోనూ ఆర్యవైశ్య యువతను ప్రోత్సహించాలన్న లక్ష్యంతో సంస్థ అధ్యక్షుడు డాక్టర్ పీఎస్ గోవిందరాజు, ట్రస్ట్ నిర్ణయించినట్లు వివరించారు. 10వ తరగతి, 12వ తరగతిల్లో 90 శాతానికి పైగా మార్కులు సాధించిన విద్యార్థులకు, డిగ్రీ, పీజీల్లో డిస్టింక్షన్ , అంతకంటే ఎక్కువ మార్కులు, పీహెచ్‌డీ, డాక్టరేట్‌లు సాధించిన వారికి, జాతీయ, రాష్ట్ర స్థాయి క్రీడా గౌరవాలు సాధించిన వారికి అవార్డులు ఇస్తామన్నారు. 2024–25 విద్యాసంవత్సరంలో కోర్సు పూర్తి చేసి ఉండాలన్నారు. అర్హత కలిగిన విద్యార్థులు దరఖాస్తులు పూర్తి చేసి, ఆర్యవైశ్య కమ్యూనిటీ ప్రూఫ్‌తో పాటు జిరాక్స్ కాపీలతో సెప్టెంబరు 15 లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆన్‌లైన్‌లో కానీ, క్యూఆర్ కోడ్‌తోగానీ, నేరుగా పెనుగొండ కార్యాలయంలో వ్యక్తిగతంగా సమర్పించాలన్నారు.